"ఏం జరిగింది !"

"మన మహారాజావారు మరణించారు" "ఎప్పుడు ఎప్పుడు" అని తను అడిగాడు.

ఈనాటి ఉదయమే - ఎక్కడ? వారు కట్టించిన ధర్మ సత్రంలో ! ఎంత అన్యాయం జరిగింది ఎంత ఘోరం జరిగింది?

తనేం మాట్లాడలేకపోయాడు. పూజ మిగతా పూజారులకు అప్పచెప్పి స్వామివారి పాదాల దగ్గర కూలబడ్డాడు.

ఒక మహనీయుడు వెళ్ళిపోయాడు. ఆకాశంలో ఒక తార రాలిపోయింది.

కన్నీటి తెరల వెనకనుంచి స్వామివారి వదనం అస్పష్టంగా కనిపిస్తోంది.

"ఆచార్లుగారూ" అంటూ మహారాజా వారి కంఠం విన్పించంది. ఉలిక్కిపడి స్వామివారి విగ్రహం వంక చూశాడు. దూరంగా ఏదో లోకంలోంచి వినిపిస్తున్నట్లుగా -

"ఆచార్లుగారూ వెళ్ళివస్తాను ! ఈ దైవం చల్లని నీడ వదిలి ఎక్కడికో దూరంగా వెళ్ళిపోతున్నాను. స్వామివారిని జాగ్రత్తగ కొలుచుకోండి. ఈ సంవత్సరం దర్శనం చేసుకోలేకపోయాను. క్షమించండి. మళ్ళీ మనం కలుద్దాం. మీ స్వామివారి నీడలోకి మళ్ళీ రావాలని వుంది. సెలవు" జేగంట శబ్దం విని ఉలిక్కిపడి ఆచార్లుగారు స్వామివారి పాదాల వంక చూశాడు. మహారాజావారి చిరునవ్వులాగా వజ్రాలహారం మిలమిల మెరుస్తోంది.

(ఆల్ ఇండియా రేడియో మద్రాసు కేంద్రం సౌజన్యంతో)

# ధ్వజస్తంభం

నాలుగు దిక్కులా మబ్బులు కమ్ముకున్నాయి. ఈదురుగాలి క్షణం క్షణం ఎక్కువౌతూంది. పగలు గడవకుండానే చీకటి వచ్చింది.

చెప్పకుండానే తెలుస్తూంది. పెను తుఫాను రాబోతూంది అని.

తుఫాను వచ్చినా, ప్రళయం వచ్చినా దైవకార్యం ఆగడానికి వీలులేదుగా ! అందుకనే అంత గాలిలోను, వానలోను గుళ్ళోకి బయలుదేరాడు పూజారి లక్ష్మయ్య. ఇల్లు గుడి ఆవరణలోనే ఉంది. పట్టు మని పాతిక గజాల దూరం ఉండదు. చీకట్లో, ఎదురుగాలిలో ఈ రవ్వంత దూరం నడవడానికి పదిసార్లు దైవాన్ని తలుచుకోవలసి వస్తూంది. ఆనాటి దారుఢ్యం లేదు. ఆ ధైర్యం లేదు. ఇప్పుడు అడుగడుగునా ఆయాసమే. క్షణం క్షణం అనుమానమే.

గుడికి పెడగా ఉన్న ఊళ్ళోంచి ఇప్పుడిప్పుడే మిణుకు మిణుకుమని దీపాలు వెలుగుతున్నాయి.

గాయపడ్డ ఏనుగు లాగా తుఫానుగాలి ఫీంకరిస్తూంది.

అలవాటుగా "రామా ! కోదండరామా !" అంటూ కోనేరు దగ్గరకు వచ్చాడు. కుంభవృష్టి వల్ల నీళ్ళు నేలబారుకు వచ్చేశాయి. మెట్లు మునిగిపోయాయి. అక్కడే నిలబడి స్నానం చేశాడు.

వాన అంతకంతకు మరీ ఎక్కు అవుతూంది. సముద్రం మీద నుంచి మరీ నల్లటి మబ్బులు వస్తున్నాయి. పెద్ద పెట్టున హోరు పెట్టుకుంటూ గాలికెరటం తన దారికి అడ్డం వచ్చిన వాటిని ఛిన్నాభిన్నం చేస్తూ గుడి మీదుగా దూసుకునిపోయింది.

ధ్వజస్తంభం ముప్పై ఆరు గంటలు ఒక్కసారి గల్లుమన్నాయి. ఆ శబ్దం విని లక్ష్మయ్య గుండె ఝల్లుమన్నది.

అలాగే పడుతూ లేస్తూ, పరుగెత్తుకుంటూ ధ్వజస్తంభం దగ్గరకు వెళ్ళాడు. ఇంతకాలం చెక్కుచెదరకుండా ఉన్న ధ్వజస్తంభం గాలిలో కదులుతున్నట్టు అనిపించింది. స్తంభం పునాది దగ్గర కట్టిన ఆంజనేయస్వామి గుడి గోడ బీటలు వారింది.

కళ్ళు మిరుమిట్లు కొలిపే మెరుపు. గుడి అంతా ఒక్కసారి కళ్ళకు కట్టింది. అంతలోనే వెయ్యి అమావాస్యల చీకటి.

ఇంకొక గాలికెరటం.

భక్తితో పరవశించిన భక్తులెవరో కొడుతున్నట్టుగా ఆలయంలో గంట దానంతట అదే మోగుతోంది.

వ్యవధి లేకుండా మెరుపుల వరద!

మెరుపుల వెలుగులో తరతరాల గాథ.

వెలుగుల వెల్లువలో ఆశల నీడలు !

పడిపోయిన ప్రహరీగోడ! బీటలు వారిన బురుజులు. వైభవం తగ్గిన గోపురాలు. ఇత్తడి బయట పడిన ధ్వజస్తంభం. ఇవి మెరుపులు చెప్పే కథలు.

తడిసి ముద్దైై ఆలయంలో అడుగుపెట్టాడు. ఆరకుండా తడిపొడిగా ఉన్న మడిబట్టలు కట్టుకుని గర్భగుడిలోకి వెళ్ళాడు.

ఈ సీమలోని వారిని తరింపచెయ్యడానికి ఎన్నో శతాబ్దాల వెనక ఈ గడ్డ మీద అవతరించిన దశరథరాముడు ఈ సృష్టి వైపరీత్యాన్ని నిశ్చలంగా తిలకిస్తున్నాడు.

ఇన్నాళ్ళుగా నిశ్చలంగా వెలుగుతున్న జ్యోతి ఈనాడు ఎందుకో రెపరెపలాడుతూంది.

అలవాటుగా అర్చన చేస్తున్నా, మనస్సు ఈనాడు దైవం మీద నిలవడం లేదు.

తెరిచిన ద్వారం గుండా వాయుదేవుడు గర్భగుడిలోకి వచ్చాడు.

"నీ తనయుడు కొలుచుకునే దైవాన్ని చూడడానికి వచ్చావా, స్వామీ?" అంటూ లక్ష్మయ్య అడిగాడు.

సమాధానం 'ఔ'నని వాయుదేవుడు హోరు పెట్టాడు.

అనాదిగా ఆలయంలో వెలుగుతున్న జ్యోతి గప్పున కొండెక్కింది.

పూజారి లక్ష్మయ్య కళ్ళలో వెయ్యిమంది రావణాసురులు కదిలారు.

గాలి తగ్గింది.

వాన హెచ్చింది.

అంతులేని భయం కలిగింది.

ఇది యుగాంతమా? అని అనుమానం కలిగింది.

ఎన్నో తరాల క్రితం వినిపించిన మాట మళ్ళీ వినిపించింది.

"తడిసిపోతున్నానురా, రామయ్యా!"

చీకట్లో తడుముకుంటూ వెళ్ళాడు. ఎన్నడూ చెయ్యని పని - అసురసంధ్యలో గుడి సింహద్వారం మూసివేశాడు.

ఈ ఘడియ కాలంలోనే వాన పెరిగింది. గాలి పెరిగింది. భయం అంతకన్నా పెరిగింది. వణికే చేతులతో దీపారాధన చేశాడు. పూజ చేసి హారతి ఇస్తూ ఇస్తూ ఆగిపోయాడు.

విగ్రహాలన్నీ తడిసిపోతున్నాయి. కాలం తెచ్చిన వగుల్ళలోంచి, సరిచెయ్యలేనిశిధిలాల నుంచి వ్యధిత హృదయంలోని కన్నీరులాగా వాన కురుస్తూ ఉంటే, స్వామివారు కదలలేక, ఇంత కాలం ఈ తావునే నిలిచిన అలవాటుగా అక్కడే నిలబడిపోయి తడిసిపోతున్నారు.

ఆ దృశ్యం చూడలేక లక్ష్మయ్య "అయ్యగారూ, మన రామయ్య తడిసిపోతున్నాడు' ' అని ఆక్రోశించాడు.

అయ్యగారి పూర్వీకులకి ఎన్నో తరాల క్రితం వినిపించిన కేక మళ్ళీ ఈనాడు వినిపించింది.

'అయ్యో, నా దైవం తడిసిపోతున్నాడే' అన్న ఆవేదన కలిగింది. కాని, ఆనాటి చొరవా, ధైర్యం ఈనాడు ఏమైయాయో?

ఆనాడు - అంటే ఈనాటికి పద్దెనిమిది తరాల క్రితం తమ వంశానికి మూలపురుషుడు రామయ్య ఇల్లు కట్టడానికి పునాదులు తీస్తూ ఉంటే, శంకుస్థాపన చేయించడానికి వచ్చిన పూజారి వరదయ్య, పళ్ళు, పువ్వులు తెచ్చిన సాహెబ్ 'నజాఖత్ ఖాన్' జన్మలు చరితార్థం చెయ్యడానికని కాబోలు కోదండరామస్వామి వారు అక్కడ వెలిశారు.

దైవం నిలిచిన చోటు వదిలి రామయ్య దూరంగా తరలిపోయాడు. దక్షిణ దిక్కున ఇల్లు వాకిలి ఏర్పాటు చేసుకున్నాడు. వెలసిన ఈ రామయ్యను మరిచిపోలేదు, ఆయన నిలిచిన చోటే చిన్న పందిరి వేశారు. చుట్టూ దడి కట్టారు. రెక్కాడితేనే కాని డొక్కాడని అక్కడి వ్యక్తులు అంతకన్నా చెయ్యలేకపోయారు.

భక్తి ఉన్నవాళ్ళు స్వామివారిని తమకు ఓపినంతగా కొలుచుకునే వాళ్ళు. పండో ఫలమో అక్కడ వదిలి పెట్టి వెళ్ళేవారు. స్వామివారిని వెదుక్కుంటూ వచ్చిన వానరులువాటిని ఆరగించి, 'రామార్పణం' అని అనుకునేవి.

వలందులు, పరాశులు, తెల్లవారు కలిసి ఉమ్మడిగా రాజ్యం ఏలుతున్న ఆ పరగణాలో ఒక దుర్దినాన కలియుగం అంతమొందె ననిపించే తుఫాను వచ్చింది. జలప్రళయం వచ్చింది. ఇళ్ళు కూలిపోతున్నాయి. చెట్లు విరిగిపోతున్నాయి. పిల్లాకూనని వెంటపెట్టుకుని ప్రాణాలు అరచేత పెట్టుకుని అంతా తలా ఒక చోట తల దాచుకున్నారు.

ఇంతలో వెయ్యి సూర్యుల వెలుగున మెరుపు మెరిసింది. భువనాలు దద్దరిల్లే పిడుగు పడింది. ఇంత శబ్దాన్ని దాటుకుంటూ ఆయనకు జాలిగా వినిపించింది.

"తడిసిపోతున్నానురా, రామయ్యా!"

రామయ్య ఒక్క క్షణం ఆగలేదు, ఎవ్వరి మాటా లెక్క చెయ్యలేదు.

"వస్తున్నాను, రామా!" అంటూ ముందుకు దూకాడు. ఆ ప్రళయం సమయంలో ఆ వాగులు, వరదలు దాటుకుంటూ అక్కడికి వచ్చి ఎలా చేరాడో? పిలిచిన వాడికే తెలుసు, వెళ్ళిన ఆయనకే తెలుసు.

సీతారాముల విగ్రహాలు తడిసిపోతున్నాయి. పైన పందిరి లేదు. చుట్టూ కట్టిన దడి లేదు.

ఆ మహారాజుబిడ్డ ఒంటరిగా, నిస్సహాయుడుగా తడిసిపోతున్నాడు. కదలని ఆ అధరాల నుంచి మాట వచ్చింది. ఆ దివ్యవాణి తన ఒక్కడికే వినిపించింది.

"తడిసిపోతున్నానురా, రామయ్యా!" ఆ మాట వినగానే రామయ్యకు ఆకాశమంత దుఃఖం పెల్లుబికి వచ్చింది.

"నే నుండగా నీకేం భయం లేదయ్యా. నీ మీద చుక్క వాన పడనివ్వను" అంటూ ఆ విగ్రహాలను తన కౌగిలిలో బంధించివేసి వాన పడకుండా అలాగే నిలబడిపోయాడు.

పెనుతుఫాను ఊరూ వాడూ తుడిచి పెట్టుకుని పోయింది. ఇంకా ఆయుష్షు మిగిలినవాళ్ళు రామయ్యను వెదుకుంటూ వస్తే వాళ్లకు కనిపించిందేమిటి? రామయ్య ఒడిలో రాములవారున్నారు. ఇంత ప్రళయం వచ్చినా వారి చిరునవ్వు వాడలేదు. సిగపువ్వు వాడలేదు. వెలుగు వచ్చిన క్షణం రామయ్య కన్ను తెరిచి "కోదండరామా! కళ్యాణరామా!" అంటూ పరవశించిపోయాడు.

"ఈ క్షణం నుంచి మా ఇలవేలుపు. ఇల్లు లేనివాడు కానడానికి వీలు లేదు. ఆయనకు ఆలయ నిర్మాణం జరగవలసిందే" అని అన్నాడు.

అంతా ఔనన్నారు.

ఆ ఆశ చక్కటిదే. ఆ కోరిక మంచిదే, భక్తుల మనస్సులో కొండంత భక్తి ఉంది కాని, సిరిసంపద తుఫాను పాలయింది.

తనను కొలిచే వారి మనస్సు చిన్నపో కూడదని తన పని తానే నెరవేర్చాడు. భక్తుల కోరిక తీర్చడు. అది కూడా ఒక దైవలీలగానే జరిగింది.

తెల్లవారికి ఆ సీమను గుత్తకు ఇచ్చిన సుల్తానువారికి, హకీములకు అర్థంకాని రుగ్మత వచ్చింది.

సమస్త పరీక్షలు చేశారు. మూడు మండలాలు తమకు తెలిసిన వైద్యం చేశారు. ఆ తరువాత పెదవి విరిచారు. రోగ లక్షణం తమకు స్పష్టం కావడం లేదని, మందుమాకులకు లొంగడం లేదని, ఇక దైవస్మరణే దివ్య ఔషధమని తలవంచుకుని అస్పష్టంగా మనవి చేశారు.

మృత్యువంటే ఆ గుండెలు తీసిన మొనగాడికి కూడా గుండె గుభేలుమన్నది. అనుక్షణం "అల్లా ! ... బిస్మిల్లా ! !" అని అనుకోవడం మొదలు పెట్టాడు.

నిత్యం కోవెలలో పువ్వుల దండలు ఇచ్చే వజాఖత్‌ఖాన్ మాట వరసగా మనవి చేశాడు పూజారి వరదయ్య హకీముల కల్లా ఉస్తాదని !

వరదయ్యకు వెంటనే ఆహ్వానం వెళ్ళింది. వరదయ్య వచ్చి ఆయనను చూసి పెద్ద పెట్టున నవ్వాడు. "మండలంపాటు నా మాట వినండి. తరువాత మీ మాట నేను వింటాను" అని అన్నాడు.

"హకీముల మాట మేము ఎప్పుడూ వింటాం" అని సుల్తానువారు బదులు చెప్పారు.

"నలబైరోజులు ప్రదోష కాలంలో పాదచారులై కోదండరాముడి దగ్గరకు రండి. ఔషధసేవ రోజూ అక్కడ జరుగుతుంది."

అందరిని ఆజ్ఞాపించే ఆ సుల్తానువారు ఈ వైద్యనారాయణుడితో "చిత్తం తమ ఆజ్ఞ" అని అన్నారు. ఆ మాట ప్రకారమే రోజూ నియమం తప్పకుండా మందు పుచ్చుకునేవారు.

మొదటి రోజుల్లో కాఫిర్లు పూజించే ఈ విగ్రహాల వంక చూసేవారు కాదు. కొద్ది రోజుల తరువాత ఆయన సమక్షంలో క్షణకాలం కూచోవడం మొదలు పెట్టాడు. రెండు పక్షాలు గడిచేసరికి స్వామివారిముందు కూర్చొని, అనుయాయులతో ఇష్టాగోష్ఠి జరపడం దాకా వచ్చింది. మండలం గడిచింది. ఆయన మామూలు మనిషి అయ్యాడు.

ఈ వింత చూసి కవిరాజులు, హకీములు అడిగారు వరదయ్యని ఇంతకాలం సుల్తాన్‌గారు సేవించిన ఔషధం పేరు ఏమిటని?

వరదయ్య పెద్ద పెట్టున నవ్వాడు. "రామనామం" అని సమాధానం చెప్పాడు.

అనుపానం?

పూజాతీర్థం!

చిలవలు పలవలుగా ఈ కథ ఆ పరగణా అంతా తెలిసింది. అద్భుతాలు చేసే ఈ హిందూ దైవాన్ని చూడడానికి వలందులు, పరాశులు, తెల్లవారు కలిసి కట్టుగా వచ్చారు. వెయ్యి అనుమానాలతో, లక్ష ప్రశ్నలతో వచ్చారు. స్వామివారిని చూశారు. సమాధానం లభించినట్టుగా సంతృప్తిగా నిలబడ్డారు.

"మీ ఋణం ఎలా తీర్చుకోను?" అని సుల్తాన్ వరదయ్యని అడిగాడు, "రహీమ్‌తోబాటు నిత్యం రాముడిని కూడా తలుచుకో. అంతకన్న మా కేం అక్కర్లేదు" అని వరదయ్య అంటే, "తృణమో ఫలమో పుచ్చుకుని తీరవలిసిందే !" అని ఒత్తిడి వచ్చింది.

"నీకు తొచిందేదో ఆ రాముడికి ఇయ్యవలసింది" అని వరదయ్య సలహా ఇచ్చాడు.

స్వామివారి నిత్యదీపారాధన, నైవేద్యం కింద రోజుకు రెండు వరహాలు ఆదాయం వచ్చే భూపసతి సుల్తాన్ వారు ఏర్పాటు చేశారు.

నలుగురు నాలుగు చేతులు వేశారు. అయినంతలో అందరికన్నా పెద్ద చెయ్యి రామయ్య వేశాడు. సకాలంలో స్వామివారి ఆలయం పూర్తి అయింది, రామకళ్యాణం చూడటానికి సుల్తాన్‌వారు తరలి రావడమే కాదు, తమ జనానాని కూడా వెంటపెట్టుకుని వచ్చారు. కళ్యాణం వైభవంగా జరిగింది.

కాలం ముందుకు నడిచింది. వలందుల పరిపాలనలో గుడికి ప్రహారీగోడ

ఏర్పడింది. అయ్యవారికి అలంకారాలు అమరినాయి.

పరాశుల కాలంలో ఈశాన్యపు దిక్కున కోనేరు వెలిసింది. గుడి ఆవరణలోనే అర్చకులకి గృహనిర్మాణం జరిగింది. అతిథి అభ్యాగతులకి విడిది ఏర్పాటయింది.

పరాశులు వెళ్ళిపోయి, తెల్లవారి ప్రాభవం వచ్చింది. గుడి, ప్రహరీనాలుగు ద్వారాల మీదా నాలుగు గోపురాలు వెలిశాయి.

ధర్మకర్తల వంశం, కాలం కలిసి వచ్చి కోటికి పడగ ఎత్తింది. గుడి పెరిగింది. రవ్వంత దూరంగా ఊరు పెరిగింది. స్వామివారి కరుణ నాలుగు దిక్కులా తెలిసింది. దూర ప్రాంతాలవారి చూపు ఈ ఊరిమీద నిలిచింది. ఈ దైవం పాదాల చెంత స్థిరపడి పోయింది.

స్వామివారి సేవకు వచ్చిన ఒక ఆస్తికుడు వేసిన ప్రశ్న

"దేవాలయానికి ధ్వజస్తంభమేది?"

మళ్ళీ ఊరూనాడూ ఏకమయింది. ధర్మకర్తలని ప్రశ్నించింది- "ధ్వజస్తంభం నిర్మాణం ఎప్పుడు?" అని.

ఆలోచన వచ్చింది. సంప్రదింపులు జరిగాయి. హృదయమంత ఎత్తుకు మనస్సు ఎగరలేకపోయింది.

భద్రాచలం అడవిలోని ఏకాండం చెక్కతో ముప్పై అడుగుల ధ్వజస్తంభం చేయించాలని భక్తులంతా నిర్ణయానికి వచ్చారు. కాని, దైవం విషయంలో కూడా కూడికలు, హెచ్చువేతలు వచ్చాయి. లాభనష్టాలు కన్ను ముందు కనిపించాయి. భక్తిమిద మంచు తెర కప్పుకుంది.

చివరకు లెక్కలే గెలిచాయి. వేదాంతమే సరిపుచ్చుకుంది. ఏదైనా చెక్కేగదా! ఏమిటి భేదం? అంటూ తర్కించారు. డబ్బు మిగిలితే స్వామి వారికే కదా లాభం అని సమాధానపరుచుకున్నారు.

దీపావళి ముసురులో లంగరు తెగి, మెట్ట నెక్కి గట్టునున్న రాళ్ళకు తగిలి, పగిలి, సగం మునిగిపోయిన పడవ తెరచాప కొయ్య కారుచవకగా వస్తే అది స్వామి వారి ఆలయానికి ధ్వజస్తంభంగా రూపొందింది.

అనుకున్న దానికన్న ఎక్కువ విరాళాలు రావడం, ఆశించినదానికన్న తక్కువ ఖర్చు కావడంతో, మిగిలిపోయిన డబ్బుతో ఈశాన్య, తూర్పు ప్రాకారాలమీద బరువు నిలిపి కొట్లు, దుకాణాలు కట్టారు. వీటిమీద వచ్చే ఆదాయంతో స్వామివారిని ఇంకా వైభవంగా సేవించుకో వచ్చునని సంబరపడ్డారు.

మాట కోసం రాజ్యాన్ని రమణిని విడనాడిన కోదండరాముడికి ఈ వాలకం ఏమీ నచ్చలేదు. ఈ లాభనష్టాలంటే అసలే గిట్టలేదు. అందుకనే కాబోలు చెంగల్వ కనుదోయి కన్నెర్ర అయింది.

ఆలయానికి తూర్పు మెరక అయింది. పడమట పల్లమైంది. ఈశాన్యం మూసుకునిపోయింది.

ఈ తీరూ తెన్నూ చూసి శ్రీ మహాలక్ష్మి 'వెళ్ళి వస్తా' నంటూ బయలు దేరింది.

ఆ రామయ్య తండ్రి చెప్పినా, ఆ సీతమ్మ తల్లి బ్రతిమాలినా, అలిగిన శ్రీదేవి ఎవ్వరి మాటా సరకుచెయ్యక రాత్రికి రాత్రి కనుచాటైంది.

పువ్వులసాహెబ్, పూజారి మరునాడే ధర్మకర్తతో మనవి చేశారు - స్వామివారి ముఖంలో ఈనాడు మందహాసం కనిపించడం లేదని, సీతమ్మ తల్లి ముభావంగా ఉందని.

ధర్మకర్త ఫకాలున నవ్వి "ఈ పిల్లలు చేసే అల్లరి భరించలేక చిరాకున ఉన్నారేమో' ' నని సరిచెప్పబోయాడు. కాని, కాలచక్రంలో మార్పు వచ్చింది. వెలుగు పోయి చీకటి వచ్చింది. సుల్తానుల వంశం అంతరించడంతో, వారి సిరి సంపదలు తెల్లవారి కైవసం అయాయి.

మనిషి మాటలకు విలువ తగ్గి, మనిషి రాసిన రాతకు విలువ పెరిగిన కాలంలో ఎవరో పూర్వీకులు ఇంకెవరో పూర్వీకులకు ఇచ్చిన మాటకు ఈ తరంలో విలువ ఏముంటుంది !

న్యాయాధిపతులు అడిగారు - "పత్రమేది, శాసనమేది? సాక్ష్యమేది? సంతకమేది!' ' అని.

అందరి రామదాసుల కథ ఒకటే ! చెరసాల పాలు కాలేదు కాని, బ్రతుకు బజారున పడింది.

కాలం కలిసిరాకపోయేసరికి ప్రజలకు కూడా దైవం మీద చిన్నచూపే! ఉత్సవాలు, ఊరేగింపులు, కళ్యాణాలు, మ్రొక్కుబడులు అన్నీ ఈతరం వారికి వెనకటి కథలయ్యాయి.

ఆ ఆలయానికి, దానిని నమ్ముకున్న వారికి గ్రహణం పట్టింది.

ధ్వజస్తంభాన్ని ఇంతకాలం అంటిపెట్టుకున్న కుబేరుడు అలకాపురి వెళ్ళిపోయుడు. సీతమ్మ వారి చిరునవ్వులో కాపురం చేసిన శ్రీదేవి పాల సముద్రం చేరుకుంది. ఆవిడ అక్కగారు జ్యేష్ఠాదేవి ఈ ఆలయానికి వస్తూ తన వెంట బొమ్మజెముడు మొక్కలు, ఉమ్మెత్తకాయలు తెచ్చుకుంది.

మనుష్యులని నమ్ముకున్నందుకు స్వామి వారు అప్పుడప్పు సకుటుంబంగా పస్తులు ఉండటం కూడా జరిగింది.

వాన వేళలో దారి తప్పి వచ్చిన ప్రయాణికుల మీద జాలి తలచి, పంచను తల దాచుకోనిస్తే, వాన వెలిసి వెలుగు వచ్చేసరికి స్వామి వారు, వారి దేవేరి నిరాభరణసుందరంగా ఉన్నారు.

ధర్మకర్తల గగ్గోలు విని గిట్టని వాళ్ళు "కంచే చేను మేసిం" దన్నారు. "ఇంటి దొంగలని ఈశ్వరుడు కూడా పట్టలే" రన్నారు.

అంతటితో ఆ ఆగడం పూర్తి కాలేదు. తెల్ల దొరలు రక్షక భటులని పిలిపించి, ఇల్లు ఇల్లు సోదా చేయించారు. మిగిలిన రవ్వంత పరువూ నడి వీధి పాలు చేశారు. కసి పూర్తిగా చల్లారాక ఈ అభాగ్యులని పంక్తి బాహ్యులని చేశారు.

ఆలయానికి, పెద్దమ్మవారికి తోడుగా శని రాహువులు వచ్చారు. లక్షలు విలువ చేసే సరుకులతో వ్యాపారానికి వచ్చిన ధర్మకర్త పడవ సముద్రం పాలైంది.

తరతరాలుగా పూల తోట్లలో పెరిగిన పువ్వుల సాహెబ్ సంపెంగ పొద దగ్గర నాగుపాము కాటు తిని కైవల్యం చెందాడు.

సావాసకత్తెలతో సముద్రస్నానానికి వెళ్ళిన పూజారి కూతురు అలలలో చిక్కుకుని అదృశ్యమైంది.

అగ్ని ప్రమాదంలో చిక్కుకున్నవారిని రక్షిస్తూ, తానుమాత్రం నిలువునా కాలిపోయాడు ధర్మకర్త ఏకైక పుత్రుడు.

కథ విన్న వాళ్ళంతా కన్నీరు కార్చలేదు. అయ్యో, పాపం అని జాలి తలచేలేదు.

సాహెబ్ సమాధి దగ్గర సాంబ్రాణి వెలిగిస్తూ, పూజారి లక్ష్మయ్యతో రామయ్యగారు అన్నారు.

"ధ్వజస్తంభం పద్దెనిమిది మెట్లు ఎగప్రాకాము. ఇంక గంటల మొగడమే తరువాయి."

"ఆ తరువాత?" అంటూ లక్ష్మయ్య అడిగాడు. "పై చూపు ఉంటే అంతా ముక్తే. మనమూ ఉండం, మన రాముడూ ఉండడు."

"అపచారం! అపచారం!" అని లక్ష్మయ్య అన్నాడు.

ఉరుములు మెరుపులు ఎక్కువైయ్యాయి. హోరుగాలి భయంకరంగా గర్జిస్తూంది. గర్భ గుడిలో దీపం బితుకు బితుకు మంటూంది. ఉరుముకన్నా బిగ్గరగా కేక పెట్టాడు లక్ష్మయ్య.

"అన్నా! మీ రామయ్య తడిసిపోతున్నాడు."

ఆ కేకకు బదులు వినిపించింది.

'వస్తున్నారా, లక్ష్మయ్యా, వస్తున్నా!"

అంతే!

వెయ్యి మెరుపులు ఒక్కసారి మెరిసినాయి. మరుక్షణంలో నాలుగు దిక్కులా నాలుగు పిడుగులు పడినాయి. వంద సంవత్సరాలుగా వేచి ఉన్న ప్రళయకెరటం తాటి ప్రమాణంగా ఊరి మీద విరుచుకుని పడింది.

అనేక ఆత్మలకు మోక్షం కలిగింది.

ప్రొద్దు తిరగగానే, పరవళ్ళు తొక్కిన ప్రకృతి ప్రశాంతం చెందింది. ఎటు చూసినా శ్మశానమంత నిశ్శబ్దం ఆవరించింది. జీవించిన వారి శోకం మరణించిన వారికి వినిపించింది.

"కరుణించవయ్యా, కోదండరామా! కాపాడవయ్యా, రఘురామా!" అంటూ భక్తులు వచ్చేసరికి దశరథరాముడూ లేడు, జనకరాజపుత్రీ లేదు.

గర్భగుడిలో లక్ష్మయ్యా, పడిపోయిన ధ్వజస్తంభం క్రింద రామయ్యా అమరులైనారు.

కూలిపోయిన కోవెల రాలిపోయిన జీవులకు సమాధి అయింది.